AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

1-12-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో ఆడిటింగ్ పూర్తి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ ఆడిటింగ్‌కు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ ఫ్యాకల్టీ చంద్రశేఖర్ హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో 2022-23, 2023-24 సంవత్సరాలకు గాను కళాశాలలోని అన్నివిభాగాలకు సంబంధించిన ఆడిటింగ్ పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



## జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దిన గురువు సుబ్బారావు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో ఎందరో జాతీయ క్రీడాకారులను తీర్చి దిద్దిన క్రీడా గురువు సుబ్బారావు అని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కొనియాడారు. ప్రైవేటు పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీ సుబ్బారావు స్మారకార్థం అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. జిల్లాలో అన్ని హంగులతో స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏడాది క్రీడల కోసం తన ట్రస్ట్ నుంచి నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు. తాను కరాటేలో ఉన్నప్పటి నుంచే సుబ్బారావు సుపరిచితులన్నారు. ఎంతోమంది క్రీడాకారులను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, డీఈవో అశోక్ కుమార్, డీవైఎస్‌వో పవన్ కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, ప్రైవేట్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అజ్మత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ముస్సిపల్ కమిషనర్, మేనేజర్ కోసం సబ్ కలెక్టర్ నిరీక్షణ




**అక్షరటుడే, బోధన్:** బోధన్ పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయానికి ఉన్నతాధికారులే సమయానికి రాకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వచ్చిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ బోధన్ పర్యటన నేపథ్యంలో.. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, మేనేజర్ రమేష్‌తో చర్చించేందుకు సబ్ కలెక్టర్ వికాస్ మహతో కార్యాలయానికి ఉదయం వచ్చారు. అయితే ఆయన వచ్చిన సమయానికి కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్ ఇద్దరూ అందుబాటులో లేరు. దీంతో సబ్‌కలెక్టర్ బల్దియా కార్యాలయం ఎదుటే వేచిఉండాల్సి వచ్చింది. అనంతరం చేసేదేమీ లేక కార్యాలయ సిబ్బంది సహకారంతో ఆయన ఫైళ్లను పరిశీలించారు. ఉదయం 11.30 అవుతున్నా ఉన్నతాధికారులు కార్యాలయానికి రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మార్కెట్ తరలించాలని ఆందోళన



**అక్షరటుడే, భీమ్‌గల్:** కూరగాయల మార్కెట్‌ను తరలించాలని భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట దుకాణదారులు, వ్యాపారులు ఆందోళనకు దిగారు. వెజిటెబుల్ మార్కెట్ మార్పులో తీవ్ర జాప్యం జరుగుతోందని సోమవారం రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కూరగాయల మార్కెట్ వల్ల ట్రాఫిక్, పార్కింగ్, మురుగు నీటితో దుర్వాసన, వ్యర్థాలు పారవేయడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్కెట్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. గతంలో అన్ని పార్టీల ప్రతినిధులు ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికీ నెలలు గడిచినా మార్కెట్ మార్పు దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. మార్కెట్‌ను మారుస్తామని అధికారులు మాటిచ్చినప్పటికీ పూర్తిగా తరలించే వరకు ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.



ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఏ గ్రామంలో చూసినా కోలాహలం కనిపిస్తోంది. ఏ నలుగురు కలిసినా ఓట్ల గురించే చర్చించుకుంటున్నారు. ఎవరిని గెలిపిద్దాం.. ఎవరు గెలుస్తారనే చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలో సర్పంచ్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కుల సంఘాల పెద్దలను మచ్చిక చేసుకుంటున్నారు. కులం ఓట్లన్నీ తమకే వేసేలా చూడాలని వేడుకుంటున్నారు.

- అక్షరటుడే, లింగంపేట

# కుల సంఘాల మచ్చిక

- గెలుపు కోసం సర్పంచ్ అభ్యర్థుల పాట్లు
- కుల పెద్దలతో చర్చలు
- ఓటేస్తామని మాట తీసుకుంటున్న వైనం

పల్లె పోరు

ఉమ్మడి జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. రెండో విడత నామినేషన్లను అధికారులు స్వీకరిస్తున్నారు. పలు గ్రామాల్లో కొన్ని కులాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ క్రమంలో ఆ కులం ఓట్లు పడితే గెలుపు ఖాయమనే భావనలో అభ్యర్థులు ఉన్నారు. దీంతో కుల సంఘాలను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. నిత్యం రాత్రి కాగానే.. సంఘ నాయకులతో మంతనాలు చేస్తున్నారు. ఎలాగైనా తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

### బేరసారాలు

సర్పంచ్ అభ్యర్థులు గ్రామంలోని ప్రధాన కుల సంఘాలతో సమావేశం అవుతున్నారు. ఆయా సంఘానికి ఏం కావాలని అడుగుతున్నారు. ఆయా సంఘాల తరఫున ఆలయాలు, సంఘం భవనం నిర్మాణం లాంటి పనులకు డబ్బులు ఇవ్వడానికి కూడా ముందుకు వస్తున్నారు. మొత్తం కుల సంఘం ఓట్లు వేసి గెలిపిస్తే ఫలానా పని చేసి పెడతామని హామీ ఇస్తున్నారు. అంతేగాకుండా పలువురు బాండ్ పేపర్లు సైతం రాసి ఇస్తుండడం గమనార్హం. కొన్ని గ్రామాల్లో ఓట్లను బట్టి సంఘానికి ఇన్ని డబ్బులు ఇస్తామని బేరసారాలు జరుపుతున్నారు. వార్డు సభ్యులు సైతం తమ వార్డుల్లోని ప్రజలతో చర్చలు జరుపుతున్నారు. నీటి సమస్య ఉన్న చోట బోర్లు వేయిస్తామని హామీ ఇస్తున్నారు.

### జోరుగా విందులు

పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ కులం ఓట్లు చీలకుండా జాగ్రత్త పడుతున్నారు. తమ వర్గం ఓట్లు గంపగుత్తగా పడేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ మేరకు నిత్యం విందులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో యువత తమవెంట ఉండేలా దావత్‌లు ఇస్తున్నారు. ఇతర కుల సంఘాల పెద్దలకు సైతం పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది.

## జీవన్ రెడ్డి ఓ పెద్ద మోసగాడు: వినయ్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఓ పెద్ద మోసగాడని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవన్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరూ సమానమేనని, ఆర్మూర్ అభివృద్ధికి తాను పాటుపడుతున్నానని స్పష్టం చేశారు. గతంలో అక్రమంగా ఇచ్చిన 147 ఇంటి నెంబర్లను తాము వచ్చాక రద్దు చేశామన్నారు. జీవన్‌రెడ్డిని ఓడించాలనే ఉద్దేశంతో ప్రచారం చేసి ఆయనను మూడోస్థానికి పరిమితం చేశానని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మోసాలపై సినిమా తీస్తే బంపర్ హిట్ అవుతుందని, ఎవరైనా మంచి దర్శకుడు దొరికితే తానే జీవన్ రెడ్డి అక్రమాలు, అరాచకాలపై చిత్రం తీస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, గిరి, కొంతం మురళి, దొండి రమణ, చిట్టీ రెడ్డి, భూపేందర్, జిమ్మి రవి, మజీద్, వాసు, రవికాంత్ రెడ్డి, గోపి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఆక్రమణలపై అధికారుల కన్నెర్ర..

**కామారెడ్డిలో అక్రమ కట్టడాల కూల్చివేత**



**అక్షరటుడే, కామారెడ్డి :** మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలపై కన్నెర్ర చేశారు. వీక్లీ మార్కెట్‌లోని సర్వే నం.6లో నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. కామారెడ్డి పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో సర్వే నం.6లో స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలను నిర్మించారు. దీంతో కొద్దికాలంగా ఈ ప్రాంతంపై సస్పెన్స్ కొనసాగుతోంది. కబ్జాల వ్యవహారాన్ని నాటి బీజేపీ నేత ప్రస్తుత ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి లేవనెత్తారు. ఈ విషయమై బాధితులు, అధికారులు కోర్టుకు వెళ్లగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పు అమలులో జాప్యం కావడంతో మున్సిపల్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఎట్టకేలకు సోమవారం మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం సదరు సర్వే నంబర్‌లో అక్రమ కట్టడాలను నోటీసులిచ్చి పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో కూల్చివేశారు. అయితే కొంతమంది వ్యక్తులు కల్లు దుకాణం, ఇసుక కుప్పల అమ్మకాలు, ఇతర వాణిజ్య వ్యాపారాల కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లను జేసీబీ సాయంతో మున్సిపల్ అధికారులు తొలగించారు. దీంతో బాధితులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి ఈ స్థలంలో కబ్జాలో ఉన్నామని తెలిపారు. సర్వేనం.8లో ఉన్న దుకాణాలను తొలగించడం సరైంది కాదన్నారు. సర్వే నం.6 మున్సిపాలిటీకి సంబంధించిన భూమిలో ఉన్న దుకాణాలను కాకుండా పక్కన ఉన్న దుకాణాలను తొలగించడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

## నామినేషన్ల స్వీకరణలో జాగ్రత్తలు అవసరం: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు :** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మోపాల్ మండలం కులాస్‌పూర్, జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. రెండోవిడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైందని, మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. చివరిరోజు ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున.. అందుకు తగినవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, కావున అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు.



## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి :** ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆర్డీవో రాజేంద్ర కుమార్ అన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. నామినేషన్లు వేసే అభ్యర్థులకు అధికారులు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ వెంకట్రావు తదితరులున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక



**అక్షరటుడే, బాన్సువాడ:** రెండేళ్లకు పైగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని చూసిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని టీజీఎస్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో వడ్ల కృష్ణమూర్తి, వడ్ల స్వరూప, నాగులూరి భాగ్య, నాగులూరి సంజీవులు, వడ్ల భాస్కర్, వడ్ల సంగయ్య, సింగం సాయిలు, కలవరాల నారాయణ, సింగం విఠల్, రాజు మాడ సాయిలు, శంకర్, మంద సాయిలు ఉన్నారు.

## తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు



**అక్షరటుడే, కామారెడ్డి:** అతను ఓ రైతు.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతడికి ముగ్గురు కూతుళ్లు. కొడుకులు లేకపోవడంతో ముగ్గురు కూతుళ్లను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు. అయితే సోమవారం ఆ రైతు అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియలు చేసేందుకు కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురే కొడుకై ముందుండి నడిచింది. కర్మకాండ నిర్వహించిన తండ్రి రుణం తీర్చుకుంది. ఈ హృదయ విదారక ఘటన కామారెడ్డి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన లకుంట్ల సుదర్శన్ కుటుంబంతో సహా కామారెడ్డి పట్టణంలోని స్నేహపురి కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఊర్లో ఉన్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతడికి డిగ్రీ, పదో తరగతి, 8వ తరగతి చదివే ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సోమవారం సుదర్శన్ అనారోగ్యంతో మృతి చెందగా పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు. వారసుడు లేకపోవడంతో పెద్ద కూతురు దేవిజ్ఞ తండ్రికి అంత్యక్రియలు చేయడానికి సిద్ధమైంది. హిందూ సాంప్రదాయం ప్రకారం తండ్రి కర్మకాండ నిర్వహించింది. కొడుకులు లేక కూతురే కొడుకై అంత్యక్రియలు నిర్వహించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

## మల్లన్న ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని అంకాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న స్వామి జాతర మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దయతో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు బాగుండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో జాతర, అగ్నిగుండం, సిడి, గుడి చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మద్యం దుకాణాలను పరిశీలించిన సీఐ



**అక్షరటుడే, బోధన్:** డివిజన్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ భాస్కరరావు పరిశీలించారు. నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం సోమవారం మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీఐ బోధన్ పట్టణంలోని పలు దుకాణాలను పరిశీలించారు. స్టాకు వివరాలు, విక్రయ వివరాల నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.



## కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిది

**అక్షరటుడే, బాన్సువాడ :** కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిదని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అమరుడైన పోలీసు కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. కిష్టయ్యలాంటి మహనీయుల త్యాగస్ఫూర్తి ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజలకు దారి దీపమని పేర్కొన్నారు. ఎంతోమంది త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, జిన్నా రఘు, లింగం, కనుకుట్ల రాజు, నరేష్, ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేకపూజలు చేసి అభిషేక, అర్చన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అయ్యప్ప మాలధారులతో కలిసి భిక్ష కార్యక్రమంలో స్వాములకు సేవచేశారు. స్వాములతో మాట్లాడుతూ.. తన సొంత నిధులతో అయ్యప్ప గుడి ఎదుట సీసీ రోడ్డును వేయించానని తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

# అబార్షన్ల అడ్డా.. ఖలీల్‌వాడి..



**నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులు అడ్డదారి తొక్కుతున్నాయి. ఖలీల్‌వాడి ప్రాంతం అబార్షన్లకు అడ్డాగా మారింది. ఈ ప్రాంతంలోని పలు ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా అనధికారికంగా అబార్షన్లు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎక్కడ కూడా నిబంధనలు పాటించట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అబార్షన్లు చేయించుకునేందుకు కారణాలు అనేకమైనప్పటికీ పలు ఆస్పత్రులు ఎలాంటి రికార్డులు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.**

**–అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**

### ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా కరువు..

జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ వైద్యారోగ్య శాఖ మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సంఘటనలు జరిగినప్పుడు మాత్రం హడావిడి చేస్తూ ప్రకటనలు జారీచేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ మెటర్నిటీ ఆస్పత్రులపై నిఘా కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు.

▸ ఇష్టారాజ్యంగా గర్భవిచ్ఛిత్తి ఆపరేషన్లు ▸ చోద్యం చూస్తున్న వైద్యారోగ్యశాఖ ▸ దండుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విచ్చలవిడిగా అబార్షన్లు జరుగుతున్న ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. అబార్షన్లు చేయించుకోవడానికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ.. ఆస్పత్రి యాజమాన్యాలు దీనినే ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నాయి. అబార్షన్ చేసిన అనంతరం ఆ అవశేషాలను నిర్లక్ష్యంగా చెత్త కుప్పల్లో విసిరేస్తున్నారు.

### పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు..

నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలో చిన్నచిన్న భవనాలను సైతం అద్దెకు తీసుకుని ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు. ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తున్నారు.

### యథేచ్ఛగా ఆపరేషన్లు..

ఖలీల్‌వాడిలో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని పలువురు ఆరోపిస్తున్నారు. అనధికారికంగా అబార్షన్లు చేయడం నేరం కాగా.. అబార్షన్ అనంతరం అవశేషాలను రోడ్ల పక్కన చెత్తబుట్టల్లో పడవేయిస్తున్నారు. ఇటీవల ఖలీల్‌వాడిలోని డయాగ్నొస్టిక్ సెంటర్ ఎదుట రోడ్డుపై మృతిచెందిన నవజాత శిశువు అవశేషం కనిపించడం కలకలం రేపింది. చెత్త బుట్టల్లోనే కాకుండా అనేకసార్లు రోడ్ల పక్కన మురికికాలువల్లో కూడా పిండాల అవశేషాలు పడేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి.


### నా దృష్టికి రాలేదు..



జిల్లా కేంద్రంలోని ఓ డయాగ్నొస్టిక్ సెంటర్ వద్ద చెత్తబుట్టలో పిండం అవశేషాలు పడేసిన ఘటన నా దృష్టికి రాలేదు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల నుంచి డెలివరీలకు సంబంధించిన డేటాను తెప్పించుకుని ఆరా తీస్తాం. సీసీ ఫుటేజీ ఆధారంగా ఏ ఆస్పత్రి నుంచి శిశువు అవశేషాలు బయటకు వచ్చాయో తెలుసుకుంటాం. అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

### కేసును దర్యాప్తు చేస్తున్నాం..



జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలో ఓ డయాగ్నొస్టిక్ సెంటర్ ఎదుట చెత్తబుట్టలో ఓ పిండం అవశేషాలు ఉన్నాయనే సమాచారంతో కేసు నమోదు చేశాం. దీనికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. కేసు విచారణ కొనసాగుతోంది. నేరం రుజువైతే సంబంధిత ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటాం.

– రఘుపతి, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో

## ‘చలో ఎల్‌బీ నగర్’ను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ‘చలో ఎల్‌బీ నగర్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్తా కోరారు. అమరుడు శ్రీకాంత చారీ వర్ధంతి సందర్భంగా ఉద్యమకారుల హక్కుల సాధనకు ఈనెల 3న కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్నవారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఒత్తిడి తీసుకొచ్చే దిశగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొన్న జేఏసీ నాయకులు తదితరులు హాజరవుతారన్నారు. ఉద్యమకారులు తప్పనిసరిగా ఉదయం 8:30 గంటలకు ఎల్‌బీ నగర్‌లోని శ్రీకాంత చారి విగ్రహం వద్దకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ స్తంభం సరిచేయాలని ఫిర్యాదు చేస్తే బెదిరించారు..



**అక్షరటుడే, ఆర్మూర్:** వంగిపోయి.. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరిపించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమపై వారు బెదిరింపులకు పాల్పడ్డాడని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఘటన ఏర్గట్లలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో వంగిపోయిన స్తంభాన్ని మార్చాలని మూడు నెలల క్రితమే విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని.. అయినప్పటికీ స్పందించకపోవడంతో ఇటీవల టీఎస్ ఎన్పీడీసీఎల్ యాప్‌లో ఫిర్యాదు చేశామని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో స్థానిక విద్యుత్ అధికారి స్తంభం ఉన్న స్థలానికి సోమవారం ఉదయం వచ్చి ‘నా ఇష్టం వచ్చినప్పుడు మారుస్తానని ఎందుకు యాప్‌లో ఫిర్యాదు చేశారు’ అని గ్రామస్థులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ సొంత జాగా కానప్పుడు ఎందుకు యాప్‌లో ఫిర్యాదు చేశారని తమపై సదరు ఏఈ బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. స్తంభాన్ని వెంటనే మార్చాలని కోరారు.

## సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రానికి చెందిన వినీల ప్రదీప్ సోమవారం కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. కమ్మర్‌పల్లి మండల కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య ఆధ్వర్యంలో ముత్యాల సునీల్ కుమార్ వారిరువురిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినీల ప్రదీప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరామన్నారు.





గాంధారిలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసి మమ్మాయి రేణుక



మోపాల్ మండల్ న్యాల్‌కల్‌లో సర్పంచ్ అభ్యర్థిడి రాయకంటి చంద్రకళ..

## జోరుగా నామినేషన్ల ప్రక్రియ

**ఉమ్మడి జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు సోమవారం తమ కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీగా నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు. అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్






మోపాల్ మండలం న్యాల్‌కల్ సర్పంచ్ అభ్యర్థిగా ధర్పల్లి సునీత..



గాంధారిలో నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి తూర్పు రాజశ్రీ రాజులు



రాణాకుర్దు సర్పంచ్ అభ్యర్థిగా శ్రీనివాస్ రెడ్డి..

## వాహనాల తనిఖీ



**అక్షరటుడే, బాన్సువాడ:** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మోస్రాలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాల తనిఖీలు నిర్వహించింది. ఎన్నికల నియమావళి అమలు ఉన్నందున ప్రతి వాహనాన్ని ఆపి పరిశీలించారు. అధికారులు, అనుమానాస్పదమైన వస్తువులను తనిఖీ చేశారు. బృంద సభ్యులు వినోద్ కుమార్, ఐలయ్య, లింబాగౌడ్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం రూ.50 వేలకుపైగా నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.



## విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని బీసీ, టీజేఎస్, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టరేట్ ఏవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు హాస్టల్ నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్నారని వివరించారు. ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సభావత్ వినోద్ చౌహన్ పాల్గొన్నారు.



## కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా సంఘం అధ్యక్షుడు గజ్జల భిక్షపతి డిమాండ్ చేశారు. పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చిన జీవోను పునరుద్ధరించాలని కోరారు. పోలీసు కిష్టయ్య మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశాడని, తన ప్రాణాలను సైతం తెలంగాణ కోసం అర్పించాడని కొనియాడారు. పోలీస్ కిష్టయ్య ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కామారెడ్డి జిల్లాను పోలీస్ కిష్టయ్య జిల్లాగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నాగరాజు, భూపాల్ గోపాల్, సుశీల్ రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బైక్ వేలం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో జప్తు చేసిన బైక్‌కు మంగళవారం వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ స్వప్న పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి సుభాష్‌నగర్‌లోని తమ కార్యాలయంలో వేలం ప్రారంభమవుతుందన్నారు. వేలంలో వాహనాన్ని పాడుకున్నవారు నగదు రూపంలో వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.